## క్లుప్తంగా

### లక్ష్మీకుమారి మృతికి ఘన నివాళులు



అట్లూరి రంగారావును పరామర్శించిన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ నాయకుడు అట్లూరి రంగారావు సతీమణి లక్ష్మీకుమారి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు సోమవారం పరామర్శించారు. రంగారావుకు ధైర్యం చెప్పి, వారి కుటుంబబ సభ్యులను పరామర్శించారు. తొలుత లక్ష్మీకుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, గుండా సుందర రామినాయుడు, గుండుగొలను ధనరాజ్, మోరా జ్యోతిరెడ్డి, పాగొల్లు రాజు, మేరుగ దీనమనస్సు, వంగా ప్రకాష్, తోట వాసు పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్యశిబిరం



భీమవరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తున్నదృశ్యం

భీమవరం: భీమవరం మెంటవారితోటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు కోయ కిషోర్ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 342 మంది రోగులను పరీక్షించగా 75 మందికి కళ్లజోళ్లు, 80 మందికి ఆపరేషన్ అవసరమవుతాయని గుర్తించారు. 10 రోజుల్లో కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని లయన్స్ హాస్పిటల్ మేనేజర్ లక్ష్మీపతి రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణంరాజు, రీజనల్ చైర్ పర్సన్ జి కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పేరిచర్ల మూర్తిరాజు పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించాలని వినతి



గ్రామంలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని కార్యదర్శి తెలియజేస్తున్న గ్రామ పెద్దలు

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో మురుగు కాలువనువ ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్థానిక పెద్దలు పంచాయతీ అధికారులను కోరినట్లు సోమవారం తెలిపారు. ప్రభుత్వం కాలనీలో స్థలాలు ఇచ్చినప్పటికీ వెళ్లడం లేదని తెలిపారు. దీనివల్ల గ్రామంలో చిన్నపాటి వర్షం వస్తే మురుగనీరు వెళ్లక రహదారులు ముంపునకు గురవుతున్నాయని స్పష్టం చేశారు. తుఫాన్ కారణంగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ బోనం భాగ్యశ్రీ శివకుమార్, ఎరుబండి రామాంజనేయులు వార్డు మెంబర్ యలమంచిలి శ్రీనివాస్, నక్కన శ్రీను, సచివాలయ సెక్రెటరీ వెంకటరమణ వాసు కలిసి సమస్యను తెలియజేసి, పరిష్కరించాలని కోరారు.

### గర్భస్రావాలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): గర్భస్రావాలను తగ్గించడానికి వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు అన్నారు. ఆయన అధ్యక్షతన జిల్లా ఎంటీపీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లల లింగ నిష్పత్తి పెంచాలని సూచించారు. తల్లీ, బిడ్డకు ఏమైనా ప్రమదం ఉందని తెలిసిన సందర్భాల్లో మాత్రమే నిబంధనలకు లోబడి గర్భస్రావాలను చేయాలన్నారు. రికార్డులు, మందుల వినియోగం, పరికరాల నిర్వహణ సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కమిటీ మెంబర్లు డాక్టర్ ఐ.లక్ష్మి, డాక్టర్ చింతి ఆనంద్, ఆర్.విక్టర్, డాక్టర్ డి.సుధాలక్ష్మి, పి.అనంతలక్ష్మి, ఆర్.కె కుమారి పాల్గొన్నారు.

### భీమడోలు సీఐగా యూజే విల్సన్ బాధ్యతల స్వీకరణ

భీమడోలు: భీమడోలు సీఐగా యూజే విల్సన్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఎస్సై వై.సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. ఏలూరు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐగా పని చేస్తూ విల్సన్ భీమడోలు సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన సీఐ బీబీ రవికుమార్ విజయవాడలోని టాస్క్‌ఫోర్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

# ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవం

ఉండి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బొజ్జగణపయ్య నిమజ్జనాలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి.దీనిలో భాగంగా ఉండి దేవునిగుడి దొడ్డిలో నాంచారమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.మూడు రోజుల నుండి భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమాలను నిర్వహించి సోమవారం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. తీన్‌మార్ డప్పుడు,బానాసంచా కాల్పులతో గ్రామంలోని ప్రధాన వీధుల ద్వారా స్వామివారి ఊరేగింపుగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు.అనంతరం నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శేషపు మణికంఠ,బూరాడ సత్తిబాబు,బూరాడ నాంచారయ్య,మజ్జి శ్రీనివాస్,బూరాడ రవికిరణ్,మామిడి నాగరాజు,దేవకోటి కుమార్,కిమిడి వినయ్,బైలంపూడి సాయికిరణ్,బైలంపూడి ప్రవీణ్‌కుమార్,తమ్మిరెడ్డి చక్రవర్తి,మజ్జి అంజిబాబు తదితర నిర్వహకులు,భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**స్వామివార్ల విగ్రహాల నిమజ్జనం**

వీరవాసరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో స్వామివార్ల విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో బాణాసంచా కాల్పుల మధ్య స్వామి వార్ల ఉత్సవ విగ్రహాల విగ్రహాల ఊరేగింపు వేడుకగా చేపట్టారు. గణేష్ మహారాజ్ కి జై అంటూ ఆధ్యాత్మిక భావనలతో ముందుకు సాగారు. అనంతరం కొన్ని గ్రామాల్లో అక్కనన సమారాధన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు.



పాలకోడేరు: పెన్నాడలో ట్రాక్టర్‌పై వినాయకుని ఊరేగింపు

**ఘనంగా వినాయకుని ఊరేగింపు**

పాలకోడేరు: పెన్నాడ తామర చెరువు గట్టు 13వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వరసిద్ధి వినాయకుని ఊరేగింపు కార్యక్రమం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు తీన్మార్ డప్పులతోనూ, విచిత్ర వేషధారణతో, డీజే సౌండ్‌తో ఘనంగా ఊరేగించారు. యువకులు, పిల్లాపాపలతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వామివారికి మహిళలు హారతులు అర్పించారు. అనంతరం స్వామి వారిని ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు దొమ్మేటి రాంపండు, గుత్తుల రాయుడు, గుత్తుల బాలాజీ, కంకటాల శీను, పంపన నాగరాజు గ్రామస్తులు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

**గణేశ్ మందిరం వద్ద అన్నసమారాధన**

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇండస్ట్రియల్‌లో వరసిద్ధి వినాయక స్వామి త్రిరాత్ర మహోత్సవ దశమ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బ్యాటరీ మూర్తి, కొత్తపల్లి సత్యనారాయణ రాజు, సీహెచ్. సత్యనారాయణ, బుద్ధన సత్యనారాయణ మూర్తి, తానింకి వెంకట్ సత్యనారాయణ, పువ్వల శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### హామ్ రేడియో మోర్స్ కోడ్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రమేష్ బాబు

భీమవరం: ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో సాధారణ కమ్యూనికేషన్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడినప్పుడు అమెచ్యూర్ రేడియో టెక్నాలజీ (హామ్) ఎంతో ఉపయోగపడుతుందని అకాడమీ ఆఫ్ హామ్ రేడియో డైరెక్టర్ ఎ.రమేష్ బాబు తెలిపారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో హామ్ రేడియో మోర్స్ కోడ్‌పై వారం రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు హామ్ రేడియో సర్టిఫికేషన్ పొంది అంతరిక్ష సాంకేతిక విద్యపై మొగ్గు చూపాలని ఆయన కోరారు. ప్రస్తుత విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ కమ్యూనికేషన్ వ్యవస్థ విఫలమైనప్పుడు ఈ హామ్ రేడియో ద్వారా అధికారులు బాధితులతో సంప్రదించగలిగారన్నారు. జె. డూండి కుమార్, ఎం.దిలీప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి



ఆకివీడు ఉప్పుటేరు వద్ద నీటి ప్రవాహతీరును కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యేలు కనుమూరు, కామినేని



ఉండిలో తహసీల్దార్ నాగార్జునకు చెక్కు అందిస్తున్న పారిశ్రామికవేత్త నారాయణరెడ్డి



బియ్యం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

ఆకివీడు: కొల్లేరు సరస్సు ముంపు నుంచి తీర గ్రామాల్ని రక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. ఆకివీడు సమీపంలోని ఉప్పుటేరు ఆర్ అండ్ బీ వంతెన వద్ద గుర్రపుడెక్క మేటల తొలగింపును ఉండి, కైకలూరు ఎమ్మెల్యేలు కె.రఘురామకృష్ణంరాజు, కె. శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురైతే తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. కొల్లేరు వరద ముంపు ఉధృతంగా ఉండటంతో సమీప గ్రామాలైన చినమిల్లిపాడు, సిద్ధాపురం, దుంపగడప గ్రామాల వద్ద పంట పొలాల్లోకి నీరు చొచ్చుకు వస్తుందని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో మట్టి బస్తాలు వేసి ముంపును అడ్డుకునే చర్యల్ని చేపట్టాలని ఆదేశించామన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కొల్లేరు సరస్సుకు అవుట్‌లెట్ ఉప్పుటేరనని చెప్పారు. గుర్రపుడెక్క, తూడు, కిక్కిస మేటవేయడంతో నీటి ప్రవాహం కొంత మేర మందగించిందని, గత వారం రోజులుగా చేస్తున్న పనులకు అడ్డంకులు తొలగాయిని చెప్పారు. ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ఆరోగ్య శిబిరం తనిఖీ**

లోని చినమిల్లిపాడు గ్రామంలోని ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ నాగరాణి తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, నవ జాతి శిశువులకు అవసరమైతే ముందస్తుగా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. పాముకాటు మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**డ్రెయినేజీ ఏఈకి సత్కారం**

డ్రెయినేజీ ఏఈ వెంకటేశ్వరరావును కలెక్టర్ నాగరాణి సత్కరించి అభినందించారు. గత వారం రోజులుగా ఉప్పుటేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, కిక్కిసను దబరాల ద్వారా తొలగింపు పనుల్ని ఎప్పటికప్పుడు పరిశీలించి, నీటి ప్రవాహ వేగాన్ని పెరిగే విధంగా తీసుకున్న చర్యల్ని అభినందించారు. దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ అద్నాన్ నయూమ్ ఆస్మి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా జలవనరుల శాఖ అధికారి పీ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**వరద బాధితులకు బియ్యం పంపిణీ**

భీమవరం: భీమవరంలోని ఉమాసోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య దాతల సహకారంతో సుమారు రూ.3.50 లక్షల విలువగల 1,100 బస్తాల బియ్యాన్ని విజయవాడ వరద బాధితుల సహాయార్థం చారు. బియ్యం లోడుకూడిన వాహనాన్ని సోమవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వేలూరి హనుమకిరణ్, మార్నెళ్ల అఖిలేష్, చెరుకుపల్లి సంతోష్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతంలోని 1,100 కుటుంబాలకు ఒక్కొక్కరికీ 5 కిలోల చొప్పున బియ్యం ప్యాకింగ్ చేయించి పంపిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్రహ్మణ్యం, సమాఖ్య నాయకులు బ్రహ్మజ్యోసుల సత్య ప్రసాద్, వేలూరి బుజ్జి, పచ్చళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రొట్టెలు పంపిణీ**

విజయవాడ వరద బాధితులకు మానవత్వంతో దాతలు సహకారం అందించడం అభినందనీయమని డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు దాతల సహకారంతో 5 వేల రొట్టెల ప్యాకెట్స్‌ను సమకూర్చగా వాటిని సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పాతపాటి మురళీరామరాజు ఆర్థిక సహకారంతో రొట్టెలు సమకూర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సన్యాసిరావు, గోపిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

**దాతల సహకారం అభినందనీయం**

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ వరద బాధితులకు మానవత్వంతో దాతలు సహకారం అందించడం గొప్ప విశేషమని డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు దాతల సహకారంతో 5 వేల బ్రెడ్ ప్యాకెట్లు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పాతపాటి మురళీ రామరాజు సౌజన్యంతో 5 వేల బ్రెడ్ ప్యాకెట్లను కలెక్టరేట్‌లో అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సన్యాసిరావు, గోపీశెట్టి మురళీ కృష్ణ పాల్గొన్నారు.

**వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేత**

ఉండి: రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ఉండి మండలం వాండ్రం గ్రామానికి చెందిన ఏఆర్ ఫిష్ ప్రొడక్ట్స్ యజమాని ద్వారంపూడి నారాయణరెడ్డి రూ.లక్ష అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును ఉండి తహసీల్దార్ నాగార్జునకు అందజేశారు. దాతలు స్పందించి వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు పాల్గొన్నారు.

### పంచాయతీల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నెల రోజుల నుంచి ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయడంతో పాటు, సూపర్ క్లోరినేషన్ కాన్సెప్ట్‌ను అవలంభించాలన్నారు. అన్ని కార్యకలాపాలు పీఆర్-వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవో పీఆర్డీలు, డివిజనల్ లెవెల్ పంచాయతీ అధికారులు పంచాయతీల్లో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

### పెరిగిన కూరగాయల ధరలను నియంత్రించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు నియంత్రణలో ఉంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో టి.రాహుల్ కుమార్ రెడ్డి మార్కెటింగ్, సివిల్ సప్లయిస్, బియ్యం, కందిపప్పు హోల్‌సేల్ అసోసియేషన్‌తో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో కూరగాయలు ధరలు స్థిరీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉల్లిపాయలు, బంగాళదుంపలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దృష్టికి వచ్చినట్లు తెలిపారు. హోల్‌సేల్ రేట్లకే అన్ని షాపుల్లో ఒకే విధమైన ధరకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా మార్కెటింగ్ అధికారి కె. సునీల్‌కుమార్, భీమవరం రైతు బజార్ ఎస్టేట్ అధికారి పి.కళ్యాణ్, డీఎస్ఓ ఏన్.సరోజ, సీపీఓ ఎం.మోహన్ రావు, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లాలోని బియ్యం, కందిపప్పు హోల్ సేలర్స్ అసోసియేషన్ పాల్గొన్నారు.

### భీమవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు సోమవారం కమర్షియల్ అధికారులతో కలసి భీమవరం టౌన్, భీమవరం జంక్షన్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ముందుగా భీమవరం టౌన్ చేరుకుని అక్కడ నూతనంగా నిర్మించిన టికెట్ చెక్కింగ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతా చర్యలు, మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ముందుగా భీమవరం టౌన్ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాల్స్, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, సూచికల బోర్డులు, తాగు నీటి సరఫరాలను తనిఖీ చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించి పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఏడీఈఎన్ శంకర్ రామానుజం, సీసీఐ ప్రదీప్, ఎస్ఎమ్ఆర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జంగారెడ్డిగూడెం ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలి

భీమవరం: భీమవరం నుంచి గణపవరం, పెదనింద్రకొలను మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే ఆర్టీసీ బస్ సర్వీసులు పునరుద్ధరించాలని జిల్లా సర్వోదయ మండలి ఆర్టీసీ డిపో మేనేజర్ పి సత్యనారాయణమూర్తిని కోరారు. ఈ మేరకు సోమవారం మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ దివంగత చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు అతిపెద్ద గాంధీ స్మారక మందిరం పెదనింద్రకొలనులో నిర్మించారని గాంధీ భవనాన్ని సందర్శించడానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారన్నారు. గతంలో తిప్పిన బస్ సర్వీస్‌ను తిరిగి పునరుద్ధరించడం ద్వారా సందర్శకులతోపాటు పలు గ్రామాల ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ భీమవరం మండల శాఖ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



భీమవరంలో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

### ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగించాలి

భీమవరం: జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటులో జరిగిన ఇబ్బందులు తొలగించాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖాకార్యాలయంలో ఏడీ-2 సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ సీనియర్, జూనియర్ సమస్యలు పరిష్కరించాలని, దూర ప్రాంతాలకు పని సర్దుబాటు చేసినవారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని, సంబంధింత సబ్జెక్టు లేకున్నా కన్వర్షన్‌తో పని సర్దుబాటు చేశారని అటువంటి వాటిని పరిష్కరించాలన్నారు. గతంలో జిల్లాలో చేసిన పనిసర్దుబాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శులు కె రామకృష్ణ ప్రసాద్, డి ఏసుబాబు, జి రామకృష్ణరాజు, భీమవరం పట్టణ అధ్యక్షుడు ఎస్ గోవింద్ పాల్గొన్నారు.



భీమవరం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

### కేంద్ర మంత్రికి సత్కారం

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), రాష్ట్ర తెదేపా పార్టీ కోశాధికారి మెంటే పార్థసారథి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు (చినబాబు)లకు భీమవరం మైత్రి కాలనీల సంక్షేమ, అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి నా వంతు సహాయం అందిస్తానని తెలిపారు. సూర్యమిత్ర ఎగ్జిమ్స్ అధినేత యిర్రింకి సూర్యారావు, గంద్రెడ్డి త్రినాథ్, వాసుకూరి కృష్ణమూర్తి, తోరం చిన్న వెంకటేశ్వరరావు, సంకు భాగ్యలక్ష్మి, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రైతులంతా ఈకేవైసీ చేసుకోవాలి

తణుకు టౌన్: రైతులు తమ పంటలను త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కే కుసుమ రైతులను కోరా రు. సోమవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో జరుగుతున్న ఈకేవైసీ పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో కుసుమ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈకేవైసీకి రైతులంతా సహకరించాలని కోరారు. ఇప్పటి వరకూ 54 శాతం ఈకేవైసీ జరిగినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సిబ్బంది మల్లికార్జునరావు, పుష్ప, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## వరి పైరును కాపాడుకునేందుకు సస్యరక్షణే మార్గం

భీమవరం అర్బన్: ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తున్నాయని వరిలో సస్య రక్షణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రులో సోమవారం మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మునిగిన వరిచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ జులైలో వరినాట్లు వేసిన తరువాతం భారీ వర్షాలతో వరి చేలు మునిగి అక్కడక్కడ దెబ్బ తిన్నాయని మళ్లీ రైతులు వరినాట్లు వేశారని ఇప్పుడు వర్షాలు అధికంగా పడ్డాయని సస్యరక్షణ చేపట్టాలన్నారు. నాట్లు వేసి 30 రోజులైతే నీరు ఐదు రోజులు చేలల్లో ఉన్నా ఆందోళన చెందనవసరం లేదన్నారు. పిలకల దశలో ఉన్న వరి పొలం ముంపునకు గురైతే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటకు వివిధ రకాల తెగుళ్ల సోకే ప్రమాదం ఉన్నదన్నారు. ముంపు ప్రాంతాల్లో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించడానికి అవకాశం ఎక్కువగా ఉన్నదన్నారు. ఈ తెగులు నివారణకు ఎండిన ఆకులను కత్తిరించి, మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేస్తే అరగంట తరువాత పరిశీలిస్తే తెగులు ఆశించిన భాగాల నుంచి బ్యాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరిగి, పసుపు రంగులోకి మారుతుందని చెప్పారు. ఈ విధంగా ఉన్న పొలంలో నీటిని 2 లేదా 3 పర్యాయాలు నీరు బయటకు పోయేట్టు చేస్తూ కొత్త నీరు పెట్టడం వల్ల తెగులు ఉధృతి తగ్గుతుందన్నారు. అనంతరం వరిలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఏవో నిమ్మల శ్రీనివాస్ వెంట మేకల బాబ్జి, కార్యదర్శి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉన్నారు.



యనమదుర్రులో ముంపునకు గురైన వరిచేలను పరిశీలిస్తున్న ఏవో నిమ్మల శ్రీనివాస్

### రోడ్డుపై గుంతల పరిశీలన



భీమవరంలోని కోడవల్లి రోడ్డులో పడిన గుంతలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

భీమవరం: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు బాగా నష్టపోయారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కోడవల్లి రోడ్డులో పడ్డ గుంతలను కేంద్ర మంత్రి స్వయంగా పరిశీలించారు. గుంతలో కారు ఏ మేర దిగుతుందో అనే దానిని కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి రాష్ట్రంలో రైతులను ఆదుకోవడానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాష్ట్రంలో పర్యటించి రైతులకు ఊరట కలిగే విధంగా తాత్కాలిక సాయాన్ని ప్రకటించారని అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే ఈ రోడ్లపై గుంతలు పూడ్చి రెండు మూడు నెలల్లో సీసీ రోడ్లు వేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.

### ప్రజలకు రక్షిత నీటిని సరఫరా చేయాలి

భీమవరం అర్బన్: ఫిల్టర్ బెడ్ల ద్వారా తాగునీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో సోమవారం సీపీఎం మండల నాయకులు ఓహెచ్ఆర్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ ద్వారా సరఫరా చేసే నీరు మురుగుగా రావడంతో తాగటానికి పనికిరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీరు కలుషితమవడంతో స్నానాలు చేస్తే దురదలు వస్తున్నాయన్నారు. గ్రామంలో కచ్చా డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ మురుగునీరు నిలిచిపోతుందన్నారు. అధికారులు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసి కచ్చా డ్రెయినేజీలు నిర్మించాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### ఉద్ధృతంగా వయ్యేరు

తణుకు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలల్లోని మురుగునీరు ఎర్ర కాలువ ద్వారా దువ్వ వయ్యేరులో ప్రవహించడంతో వయ్యేరుకు వరద ఉధృతి పెరిగింది. సోమవారం సాయంత్రానికి దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద 9 అడుగులకు నీటి మట్టం చేరుకోవడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వరద పరిస్థితిని పరిశీలించారు.